విశాలాంధ్ర
విజయనగరం
బుధవారం 26, జూన్ 2024



## డ్రగ్స్ వినియోగంతో అనర్థాలపై అవగాహన

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: జిల్లా ఎస్పీ ఎం.దీపిక ఆదేశాలతో మంగళవారం వన్ టౌన్ పోలీసులు పట్టణంలోని ఎస్ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్ వినియోగం వలన కలిగే అనర్థాలను వివరించేందుకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వన్‌టౌన్ సిఐ డా. బి.వెంకటరావు మాట్లాడుతూ-మాదక ద్రవ్యాల వినియోగం వలన విచక్షణ కోల్పోయి, మత్తులో హింసాత్మక సంఘటనలకు పాల్పడి, క్రిమినల్ కేసుల్లో నిందితులుగా మారే అవకాశం ఉందన్నారు. మత్తు పదార్థాల అలవాటు పడితే భవిష్యత్తు నాశనమేనని అన్నారు. తల్లిదండ్రుల కలలను నిజం చేసేందుకు ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకొని, శ్రద్ధగా చదివి, ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. భవిష్యత్తు నాశనం చేసే మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై హరిబాబు నాయుడు, కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ గా డా. బీఆర్ అంబేద్కర్ బాధ్యతలు

### స్వాగతం పలికిన అధికారులు

### జిల్లా అభివృద్ధికి కృషి చేస్తా : కలెక్టర్

విశాలాంధ్ర -విజయనగరం: జిల్లా కలెక్టర్ గా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్ చేరుకున్న ఆయనకు జిల్లా అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ ఛాంబర్లో ప్రవేశించి, బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ, జిల్లా అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానని, అన్ని రంగాల్లో అభివృద్ధి పథాన నడిపిస్తానని చెప్పారు. ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా కార్యక్రమాలను ముందుకు తీసుకు వెళతామని అన్నారు. గతంలో తాను జిల్లాలో వివిధ హోదాల్లో పని చేసానని, జిల్లా పరిస్థితులపై కొంతవరకు అవగాహన ఉందని కలెక్టర్ తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ అంబేద్కర్ కు జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్వో ఎస్.డి.అనిత, వివిధ శాఖల అధికారులు, అసోసియేషన్ల ప్రతినిధులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున అభినందనలు తెలిపారు.

### నేడు సీజనల్ వ్యాధులపై కలెక్టర్ సమీక్ష

సీజనల్ వ్యాధుల వ్యాప్తి పై, జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈ సమీక్షా సమావేశం జరుగుతుంది. వైద్యారోగ్య శాఖ, పంచాయితీ, త్రాగునీటి సరఫరా తదితర శాఖల అధికారులు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు ఈ సమావేశంలో పాల్గొననున్నారు.

## సమస్యలు పరిష్కారానికి సిబ్బంది చర్యలు చేపట్టాలి

### మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి

విశాలాంధ్ర-బొబ్బిలి: సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి సిబ్బంది ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా ఇంచార్జి శానిటరీ ఇన్స్పెక్టర్, పర్యావరణ ఇంజనీరు, పబ్లిక్ హెల్త్ మెస్త్రీలు, వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంటల్ సెక్రటరీలతో వంతరాం రోడ్డు సచివాలయ పరిధిలో గల చీపురుపల్లి వీధి, వెలమవారి వీధి మరియు గాంధీ బొమ్మ ఏరియలలో పర్యటించారు. వెలమవారి వీధి ప్రైవేట్ సైట్ లో ఉన్న కల్వర్టు పలకలు కిందకి ఉండటంతో వర్షం పడుతున్నప్పుడు నీరు రోడ్డు పైకి ప్రవహిస్తుందని గుర్తించి ఆ స్థలం యజమానికి నోటీసులు జారీ చేసి కల్వర్టు ఎత్తు చేయించాల్సిందిగా ఆదేశించారు. పైప్ లైన్ వాల్వ్ మరమ్మత్తుల కొరకు తవ్విన గుమ్ముచుట్టు నీరు చేరుతున్నట్లుగా గుర్తించి, ఆ నీటిని తొలగించి సక్రమంగా మైంటైన్ చేయాలని ఆదేశించారు. అపార్ట్మెంట్ వద్ద ఉన్న ఆన్ సైట్ కంపోస్టింగ్ పరిశీలించి వారికి సూచనలు జారీ చేశారు.

# పాలనలో ప్రత్యేక శైలి

### ➧ జిల్లా కలెక్టర్ అభినందన సభలో అధికారులు

విశాలాంధ్ర-విజయనగరం: జిల్లా కలెక్టర్ గా నాగలక్ష్మి పాలన పై తనదైన ప్రత్యేక శైలిని ప్రదర్శించారని జిల్లా అధికారులు కొనియాడారు. ఎవ్వరిని నొప్పించకనే లక్ష్యాలను చేరుకోవడంలో తన ప్రత్యేకత ను చూపించారని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ గా పని చేస్తూ బదిలీ పై వెళుతున్న నాగలక్ష్మికి జిల్లా అధికారులు, రెవిన్యూ అసోసియేషన్ వర్షోమవారం ఘనంగా వీడ్కోలు పలికారు. జిల్లా జడ్జి కల్యాణ చక్రవర్తి, జె.సి కార్తీక్, ఎస్.పి దీపిక, జిల్లా అధికారులు కలెక్టర్ సేవలను కొనియాడి ఘనంగా సత్కరించారు నిరాడంబరతకు మారుపేరు మన కలెక్టర్ నాగలక్ష్మియని, ఉన్నత స్థాయి అధికారులనుంచి క్షేత్రస్థాయి సిబ్బందితో సైతం ఎటువంటి బేషజాలు లేకుండా మాట్లాడే వారని జె.సి కార్తీక్ కొనియాడారు. 2023 ఏప్రెల్ 12న జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన నాగలక్ష్మి, అందరినీ కలుపుకొని ఎన్నో ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారని, అందరినీ కలుపుకొనిపోయి ఎన్నికలలోవీశాంతి భద్రతల పరిరక్షణలో సహకరించారని, ప్రభుత్వ పథకాలను శతశాతం క్షేత్రస్థాయిలో అందించారని ఎస్.పి దీపికా గుర్తు చేసుకున్నారు. విస్తృత పర్యటనలతో, జిల్లాపై సమగ్ర అవగాహన ఏర్పరచు కున్నారని, ప్రభుత్వ ప్రాధాన్యతాంశాలను, పథకాలను సకాలంలో ప్రజలకు చేరువచేశారని డి.ఆర్.ఓ కొనియాడారు. ఆర్.డి.ఓ సూర్యకళ మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణలో తనదైన పనితీరుతో, రాష్ట్ర గవర్నర్ చేతులమీదుగా ఉత్తమ పురస్కారాన్ని పొందారని తెలిపారు. జిల్లా ముఖచిత్రాన్ని మార్చివేసే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం శంకుస్థాపన ఆమె హయాంలో జరిగిందన్నారు. జిల్లా వాసుల సుదీర్ఘ స్వప్నమైన ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభోత్సవం కూడా కలెక్టర్ నాగలక్ష్మి పాలనా కాలంలోనే జరిగిందని, ఫిషింగ్ జెట్టీ, కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం శంకుస్థాపన కూడా పూర్తయ్యిందని, జెఎన్‌టియు గురజాడ విశ్వవిద్యాలయం అభివృద్ధి దిశగా పరుగులు, గత అక్టోబరు నెలలో శ్రీ పైడితల్లి అమ్మవారి సిరిమాను పండుగ, విజయనగరం ఉత్సవాలను కూడా విజయవంతంగా నిర్వహించారని పేర్కొన్నారు.

**కలెక్టర్ స్పందన**

అందరి సమష్టి కృషితో, టీమ్ వర్క్‌తో జిల్లాను విజయవంతంగా నడిపించగలిగామని అందరికీ పెరు పేరున ధన్యవాదాలు తెలిపారు. అంకితభావంతో పని చేస్తే గుర్తింపు అదేవస్తుందని, గుర్తింపు కోసం పని చేయకూడదని తెలిపారు. సంవత్సర కాలంలో అనేక కార్యక్రమాలు నిర్వహించే అవకాశం లభించింది, ప్రజల, అధికారుల సహకారం మరువలేనిదని పేర్కొన్నారు.

### కలెక్టర్ నాగలక్ష్మికి అభినందనలు తెలిపిన సమాచార పౌర సంబంధాల శాఖ

బదిలీపై వెళ్తున్న జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి కి, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అభినందనలు అందజేసింది. జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖాధికారి డి.రమేష్ ఆధ్వర్యంలో ఆ శాఖ అధికారులు, సిబ్బంది సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ను కలిసి ప్రత్యేకంగా అభినందించారు. ఆమె ఫోటోలతో కూడిన చిత్ర మాలికను జ్ఞాపికగా బహూకరించారు. తమ శాఖకు

కలెక్టర్ అన్ని విధాలా సహాయ సహకారాలను అందించారని, కొత్త కార్యాలయ భవనాలను సైతం కేటాయించారని, డీపీఆర్వో రమేష్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పిఆర్వో ఎస్.జానకమ్మ, జెఆర్ఈ మల్లేశ్వరరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## వరి విత్తనాల పంపిణీ

విశాలాంధ్ర-గుర్ల: ఖరీఫ్ సీజనకు సంబంధించి మండలంలోని పాలవలస రైతుభరోసా కేంద్రంలో రైతులకు రాయితీపై వరి విత్తనాలను ఎంపిపి ప్రతినిధి పొట్నూరు సన్యాసినాయుడు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయం పరిధిలో రైతులందరికీ పూర్తిస్థాయిలో విత్తనాలు అందించాలని విఏఏ సంగమేష్ కు సూచించారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వల్లూరు రాము, బుర్లె శ్రీనివాసరావు, టిడిపి నాయకులు డాక్టర్ సుంకరి రమణమూర్తి, తాడ్డి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ ను సత్కరించిన మంత్రి కొండపల్లి

విశాలాంధ్ర-విజయనగరం: బదిలీ పై వెళ్తున్న విజయనగరం కలెక్టర్ నాగలక్ష్మిని, రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దుశ్శాలువతో సత్కరించారు. ఆమెకు పూలగుచ్చం అందించి అభినందనలు తెలిపారు. జిల్లాలో సమర్థవంతమైన సేవలు అందించారని కొనియాడారు. మంగళవారం ఉదయం కలెక్టర్ చాంబర్లో ఈ కార్యక్రమం జరిగింది.

## నీటిపారుదల శాఖ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే లోకం నాగమాధవి

విశాలాంధ్ర-డెంకాడ: మంగళవారం సచివాలయంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుని మర్యాదపూర్వకంగా కలసి మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేయజేసిన నెల్లిమర్ల నియోజకవర్గ శాసనసభ్యురాలు లోకం మాధవి అలాగే నియోజకవర్గంలోని పలు సాగునీటి కాలువల పరిస్థితి, పూర్తి కావలసిన పలు నీటి ప్రాజెక్ట్ లు, తోటపల్లి కాలువ దుస్థితి, గత 5 ఏళ్లగా తారక రామ తీర్థ సాగర్ ప్రాజెక్ట్ ని గత ప్రభుత్వం పెడ చెవిన పెట్టిన వైనం, చంపావతి-గోస్తాని నదుల అనుసంధానం ద్వారా నియోజకవర్గ ప్రజలకి త్రాగు నీరు సాగు నీరు అందించే లక్ష్యం దిశగా రామానాయుడు తో చర్చించారు.

## సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి : ఎంపిపి అనూష రెడ్డి



విశాలాంధ్ర-భోగాపురం: వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త వహించాలని ఎంపిపి అనూష రెడ్డి అధికారులను ఆదేశించారు అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డయేరియా ప్రబలిన తర్వాత చేపట్టే చర్యల కంటే ముందస్తు చర్యల వల్ల డయేరియా రాకుండా అడ్డుకోవచ్చని అన్నారు. ఎంపిడిఓ చంద్రకళ మాట్లాడుతూ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తమ గ్రామాలలో సర్పంచులతో సమన్వయంతో పనిచేయాలని అన్నారు. త్రాగే నీటిని క్లోరినేషన్ చేయాలని అన్నారు. త్రాగునీటి ట్యాంక్ లను శుభ్రపరచాలని, గ్రామాలలో ఎక్కడ నీరు నిల్వ లేకుండా చూడాలని అన్నారు. ప్రతీ రోజు గ్రామంలో తిరిగి నీటి పరీక్షలు నిర్వహించాలని అన్నారు. ముఖ్యంగా బహిరంగ మల విసర్జన జరగకుండా చూడాలని అన్నారు. డీఇఇ వైకుంతం నాయుడు మాట్లాడుతూ త్రాగు నీటి బోర్లు ఉన్న ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. నీటి సరఫరా లో లీకులు లేకుండా చూసుకోవాలని అన్నారు. మండలంలో కొన్ని గ్రామాలు అపరిశుభ్రంగాఉంటున్నాయని ఎంపిపి సలహాదారు సూర్యనారాయణ రెడ్డి అన్నారు. గ్రామాల్లో చెత్త ను ఎప్పటికప్పుడు తొలగించి గ్రామాలను శుభ్రంగా ఉంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సురేష్, కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## వీధిదీపాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధకనబరచాలి

### నగరపాలక సంస్థ కమిషనర్ నాయుడు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : నగరంలో వీధి దీపాల సక్రమ నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సిబ్బందికి నగరపాలక సంస్థ కమిషనర్ ఎం ఎం నాయుడు ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఐడిఎస్ఎంటి కాంప్లెక్స్ కార్యాలయంలో ఉన్న వీధి దీపాల పరికరాల పరిస్థితిని గమనించారు. ప్రజలు, కార్పొరేటర్ల నుండి వచ్చిన ఫిర్యా దులను తక్షణమే పరిష్కరించే దిశగా తగిన సామాగ్రి సిద్ధంగా ఉందా లేదా అని సిబ్బంది అడిగి తెలుసుకున్నారు. అందుకు అవసరమైన ఏర్పాట్లను త్వరితగతిన చేపట్టాలని సూచించారు. వీధులలో విద్యుత్ దీపాలు వెలగలేదని ఫిర్యా దులు అందిన వెంటనే ఏర్పాటు అయ్యేవిధంగా చూడాలన్నారు. విద్యుత్ దీపాలు మరమ్మత్తులకు గురైనట్లయితే తక్షణమే సంబంధిత అధికారులకు తెలియజెప్పాలన్నారు. విద్యుత్ దీపాల నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టంచేశారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎంఎం నాయుడు మాట్లాడుతూ నగరంలో వీధి దీపాలు సమస్యను తక్షణమే పరిశీలించేందుకు చొరవ చూపుతున్నామన్నారు. ప్రజల నుండి గాని, స్థానిక కార్పొరేటర్ నుండి గాని వీధి దీపాలు వెలగలేదని ఫిర్యాదు వచ్చిన వెంటనే సమస్యను పరిష్కరించి ఫిర్యాదుదారులతో సంతకాలను తీసుకునే విధంగా సిబ్బందికి ఆదేశించామన్నారు. ..

## పిరిడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో అరకొర మెనూ ...

### విద్యార్థుల ఆందోళన

విశాలాంధ్ర-బొబ్బిలి: మండలం పిరిడి గ్రామం జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులకు మధ్యాహ్నం విద్యార్థులకు ప్రభుత్వ అందిస్తున్న మెనూ సక్రమంగా పెట్టకుండా విద్యార్థులకు చాలీచాలని మెనూ పెడుతూ ఆకలి కేకలకి గురిచేస్తున్న మిడ్ డే మిల్ సిబ్బంది పై కఠిన చర్యలు తీసుకోవాలని, తక్షణమే సిబ్బందిని విధులు నుండి తొలిగించాలని విద్యార్థులు ఆందోళన చేపట్టారు. మంగళవారం 258 మంది విద్యార్థులు హాజరయ్యారు. హెచ్ ఎం మధుసూదన్ రావు విద్యార్థులకు మెనూ ప్రకారం 36 కేజీల బియ్యం, మూడున్నర కేజీల వేరుశనగ పప్పు, 258 కొడి గుడ్లు ఇచ్చామని హెచ్ ఎం మధుసూదన్ రావు విలేకరులకు తెలిపారు. గత కొంతకాలంగా మిడ్ డే మిల్ నిర్వహకులు విద్యార్థులకు అరకొర మెనూ ఇస్తున్నారని విద్యార్థులు తల్లిదండ్రులు స్కూల్ వద్ద ఆందోళన చేపట్టారు. గత కొంతకాలంగా మిడ్ డే మిల్ నిర్వహకులు విద్యార్థులకు అరకొర మెనూ ఇస్తున్నారని విద్యార్థులకు ఆకలి తీరడం లేదని కొంతమంది విద్యార్థులకు గుడ్లు ఇవ్వడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేశారు స్కూల్లో విద్యార్థులకు వండు తున్న వంట పదార్థాలు పక్కదారిని పడుతున్నాయని విద్యార్థులు విలేకరుల ముందు ఆవేదన వ్యక్తంచేశారు. అన్నంచాలాలేదని అడిగితే పెట్టడంలేదని దీంతో ఆకలితో అలమటిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం విలేకరులు జిల్లా పరిషత్ హై స్కూల్ కు చేరుకోక సుమారు 60 మంది విద్యార్థులకు కోడిగుడ్లు, దొండకాయ్ పచ్చడి, పులిహోర సరిపడకపోవడంతో గంటల తరబడి విద్యార్థులు ఆకలి కి అలమటించారు. ఉన్నత పాఠశాల హెడ్ మాస్టర్ మధుసూదన్ రావుని విలేకరులు వివరణ కోరగా విద్యార్థులకు సరిపడే బియ్యము కోడిగుడ్లు దొండకాయలు అందజేశామని మిడ్ డే మిల్ సిబ్బంది ఏం చేశారో మాకు తెలియటం లేదని అన్నారు. జరిగిన సంఘటన పైన సంబంధిత శాఖ అధికారులకు నివేదిక అందజేస్తామని తదుపరి మిడ్ డే మిల్ నిర్వహకులు పైన తగు చర్యలు తీసుకుంటామని విలేకరులు తెలిపారు.

## భారీ వర్షానికి ఎస్.కోట-విశాఖ ప్రధాన రహదారి జలమయం

- వాహనదారులు, విద్యార్థులు ఇక్కట్లు
- కల్వర్టు నిర్మాణాలు లేకనే ఈ దుస్థితి

విశాలాంధ్ర-శృంగవరపుకోట: ఎస్.కోటలో మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి విశాఖ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై పెద్ద ఎత్తున నిలిచిపోవడంతో వాహనదారులు, కళాశాలల నుండి వచ్చే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. షిర్డీసాయి మందిరం వద్ద గల కుళ్లు కోనేరుకి శ్రీనివాస కాలనీ నుండి వచ్చే భారీ నీరు ప్రధాన రహదారి మీదుగా దిగువన ఉన్న రాజులు చెరువు వైపు ప్రవహించింది. ఇక్కడ ఉన్న పాత కల్వర్టు శిథిలావస్థకు చేరుకోవడం తోనే ఈ దుస్థితి ఏర్పడుతోంది.

ఎస్.కోట-విశాఖ ప్రధాన రహదారిలో భారీగా నీరు నిలిచిపోయిన దృశ్యం

అలాగే జూనియర్ కళాశాల మైదానం ఎదురుగా ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టు లేకపోవడంతో రోడ్డుపై భారీగా నీరు నిలిచిపోవడంతో పలు షాపుల వారు, ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగించే వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా మేజరు పంచాయతీ పాలకులు, ఆర్ అండ్ బి అధికారులు విశాఖ వైపు ప్రధాన రహదారిపై నీరు నిలిచిపోయే దుస్థితి లేకుండా చర్యలు తీసుకోవాలని ఎస్.కోట పట్టణ ప్రజలు, ప్రయాణించే వాహన దారులు కోరుతున్నారు.

జూనియర్ కళాశాల ఎదురుగా నీరు ప్రవహిస్తున్న దృశ్యం

ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా రోడ్డుపై నిలిచిన నీరు

## సీఎంకు ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల కృతజ్ఞతలు

విశాలాంధ్ర-లక్కవరపుకోట: తొలి క్యాబినెట్లో హామీలకు శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కి కృతజ్ఞతలు తెలుపుతున్నానని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఈనెల గడిచిన 24వ తేదీన అమరావతిలో మొదట కేబినెట్ సమావేశంలో ఏళ్ల తరబడి ఎదురు చూపులకు ఫలితం దక్కిన శుభదినం 16347 పోస్టులతో కూడిన మేఘ డీఎస్సీ, ప్రజా వ్యతిరేక చట్టమైన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, ప్రతి ఇంటికి పెద్ద కొడుకురా నేలకు 4వేల రూపాయలు పెంపు, నిరుపేదలకు ఆకలితీర్చే అన్న క్యాంటీన్ల పున ప్రారంభం, నైపుణ్య గణనపై 5 వసంతం చేసి యువత భవితకు బంగారు బాటలు వేసారని అన్నారు ఈ సందర్భంగా మంత్రులు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎల్కోట మాజీ ఎంపీపీ కొల్లి రమణమూర్తి, క్లస్టర్ ఇన్చార్జి పొట్నూరు వెంకటరత్నాజీ, విశాఖ పార్లమెంటు తెలుగు యువత ఉపాధ్యక్షులు లంక శ్రీను, విశాఖపట్నం కార్యనిర్వాహక కార్యదర్శి విరోత్ శివాజీ, గొంప దుర్గా ఉమేష్, కొట్టాన విజయ్ కుమార్, ఏడువాక గణేష్ గొంప చిన్న బాబు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్ తో యువకుడు మృతి

### నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

### విషాదంలో గోవిందపురం ప్రజలు

విశాలాంధ్ర -వూనపాటిరేగ: అధికారుల నిర్లక్ష్యానికి ఒక నిండు ప్రాణం బలైపోయింది. గోవిందపురం సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఈ సంఘటన జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. ఉదయం 10 గంటల సమయంలో విద్యుత్ స్తంభం పై జంపర్ పోయిందని స్థానిక విలేజ్ జూనియర్ లైన్మెన్ సిటికం కుమార్ తనకు సహాయంగా పనిచేసే ఇద్దరు యువకులను లైన్ మీదకు పంపించారు. లైన్ ఇన్స్పెక్టర్ దగ్గర లైన్ క్లియరెన్స్ తీసుకొని విక్రమ్ శ్రీను(28), తండ్రి సీతారామయ్య. గొంపు సాయిరాం ఇద్దరిలో గొంప సాయిరాం కింద ఉండి విక్రమ్ శ్రీను లైన్ పైకి ఎక్కించి జంపర్ కనెక్ట్ చేస్తున్న టైంలో సబ్ స్టేషన్ లో ఉన్న మూడు లైన్లలో పొరపాటున స్తంభంపై పనిచేస్తున్న లైన్ కి విద్యుత్ ఆన్ చేయడంతో పెద్ద శబ్దంతో ఫీడరు ఆగిపోయింది. వెంటనే కింద ఉన్న గొంప సాయిరాం స్తంభంపై ఉన్న శ్రీను విద్యుత్ షాక్ తగిలి కేసారం కి కాల్ ఇరుక్కుని పడుతుండడంతో అతి కష్టం మీద అతన్ని కిందకి దించి తనకు తెలిసిన విధంగా సిఆర్పి చేసినప్పటికీ అతనిలో చలనం లేదు. వెంటనే జేఎల్ఎం కుమార్ కు ఫోన్‌చేసి అతని కారులో సుందరపేట సిహెచ్‌సీ కి తరలించారు. అక్కడ డాక్టర్ల పరీక్షించి అప్పటికే ప్రాణం పోయిందని నిర్ధారించారు. తన తండ్రి సీతారామ ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం స్థానిక ఎస్సై సన్యాసినాయుడు సంఘటన స్థలాన్ని పరిశీలించి, బాడీని పోస్టుమార్టం పూర్తి చేసి,కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు


**గ్రామ పంచాయతీ కార్యాలయం - బొండపల్లి**

**వేలం మరియు టెండరు ప్రకటన**

రేఖా నెం. 03/2024 తేదీ: 25/06/2024

విజయనగరం జిల్లా బొండపల్లి మండలం బొండపల్లి గ్రామ పంచాయతీ కి చెందిన ఈ దిగువ మదహరించిన షెడ్యూల్ 1 ప్రాప్తికి 2024-25 సంవత్సరమునకు పారిశుధ్య పనుల నిర్వహణ, మరియు త్రాగునీటి నిర్వహణ (PWS) పనులు గూర్చి ఈ దిగువ చూపిన విధముగా తేదీ: 29-6-2024 ఉదయం 10:30 గంటల నుండి 1:30 వరకు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద షీల్డ టెండర్లు స్వీకరించి అదే రోజు మధ్యాహ్నం 2:30 గంటలకు హాజరు అయిన టెండర్ దారుల సమక్షం లో సదరు టెండర్లు తెరవబడును. వేలంపాట లో పాలుగున్న వారు మరియు షీల్డ టెండర్లు వేయగోరు వారు ఈ పంచాయతీ షరతులకు లోబడి షెడ్యూలు లో చూపిన ప్రకారం చెల్లించవలసిన ధరావత్తులు ముందుగా చెల్లించి ధరావత్తులు రశీదు తో పాటు షీల్డ టెండర్లు దాఖలు చేయవలెను. ధరావత్తులు చెల్లించని టెండర్లు నిరాకరించబడును. వేలంపాట లో పాలుగున్నదలచిన వారు రూ.25000/-లు (అక్షరముల ఇరవై అయిదు వేల రూపాయలు) ఆస్తి విలువ గల ధృవపత్రం (సాల్వెన్సీ సర్టిఫికేటు) దాఖలు చేయవలెను, మిగిలిన వివరములు ఈ కార్యలయం పని వేలల లో స్వయముగా వచ్చి తెలుసుకొనగలరు.

1 టెండరులు షెడ్యూల్ -1

| వరుస | వివరములు | సంవత్సరం | ధరావత్తు |
|---|---|---|---|
| 1 | కాంట్రాక్ట్ పద్ధతి పై పారిశుధ్య పనులు నిర్వహించుటకు 3 మందిని సప్లయ్ చేయుటకు | 2024-25 | 1500 |
| 2. | కాంట్రాక్ట్ పద్ధతి పై PWS స్కీమ్ లు ఆపరేట్ చేయుటకు 1 రిని సప్లయ్ చేయుటకు | 2024-25 | 600 |

గమనిక : 1) ఈ గ్రామ పంచాయతీ కాంట్రాక్ట్ పనులు నిర్వహించు వారు శ్రీ జిల్లా కలెక్టర్ (పంచాయతీ విభాగం) వారికి లోబడి టెండర్లు దాఖలు చేయబడును. 2) కాంట్రాక్టరు కాంట్రాక్ట్ లేబర్ కు రెండు జతలు బట్టలు, చెప్పులు, సబ్బులు మరియు కొబ్బరి నూనె సరఫరా బాద్యత వహించి టెండరు దాఖలు చేయవలెను. 3) టెండర్ దారు కాంట్రాక్ట్ లేబర్ కు భీమా మరియు PF చేయించవలెను.

శ్రీ బొండపల్లి ఈశ్వరరావు గారు, సర్పంచ్ /గ్రామ పంచాయతి, బొండపల్లి

జి శ్రీనివాస రావు గారు, పంచాయతీ కార్యదర్శి / గ్రామ పంచాయతి, బొండపల్లి


## మాజీ ఎంపి బెల్లాన పరామర్శ

విశాలాంధ్ర -రాజాం: రాజాంలో ప్రముఖ చేనేత సంఘం నాయకుడు దొంతంశెట్టి శ్రీనివాస రావు ను మాజీ ఎంపి బెల్లాన చంద్రశేఖర్ మంగళ వారం పరామర్శించారు. శ్రీనివాసరావు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడిన ఆయన ఇటీవల రాజాంలో తన నివాసానికి వచ్చారు. ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నారు. ఆయన్ను మాజీ ఎంపి పరామర్శించి, ఆరోగ్యం గూర్చి అడిగితెలుసుకున్నారు. త్వరగా పూర్తిస్థాయి లో కోలు కోవాలని ఆకాంక్షించారు. ఆయనవెంట స్థానిక వైకాపా నాయకులు పాలవలస శ్రీనివాస రావు, జడ్పీటీసి బండి నరసింహులు, నాగేశ్వరరావు, తూతిక ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.

## మంత్రిగారూ..! కాస్తా దృష్టి సారించరూ..!

### పరిష్కారం కాని శాసనాపల్లి-పెదవేమలి వంతెన నిర్మాణం

### మాట నిలుపుకోని విశాఖ డెయిరీ

### వంతెనతో రెండు మండలాల రాకపోకలు సులభతరం

విశాలాంధ్ర -జామి: మండలంలోని శాసనాపల్లినుంచి గంట్యాడ మండలంలోని పెదవేమలి మీదుగా చాలా గ్రామాలకు వెళ్లే రహదారిలో గెడ్డ వద్ద వంతెన నిర్మాణం చేయాల్సి ఉంది. ఇది ఏళ్ళ తరబడి పరిష్కారం కాని సమస్యగానే ఉండిపోయింది. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా సమస్యపై స్పందించే వారే కరువయ్యారు. స్థానిక నేతలు ఎన్నో సార్లు ప్రయత్నించి చివరకు విసిగి వదిలేసారు. ప్రస్తుతం గజపతినగరం నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిచిన కొండపల్లి శ్రీనివాస్ మంత్రి పదవి సైతం చేపట్టడంతో స్థానిక ఎంతో ఆశగా ఈవంతెన నిర్మాణంపై ఎదురు చూస్తున్నారు.

### మాట తప్పిన విశాఖ డెయిరీ..

శాసనాపల్లి గెడ్డ మీదుగా వంతెన చేపడతామని ప్రముఖ సంస్థ విశాఖ డెయిరీ చాలా కాలం క్రితం ముందుకు వచ్చింది. కానీ ప్రస్తుతం డెయిరీ సంస్థ ఈవిషయాన్ని పూర్తిగా మరిచిపోయింది. ప్రభుత్వం తరుపున వంతెన నిర్మాణం చేయాలని స్థానిక ప్రజలుకోరుతున్నారు. ఈవంతెన నిర్మాణం జరిగితే రెండుమండలాల ప్రజల రాకపో కలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్న మంత్రి శ్రీనివాస్ దృష్టికి స్థానిక నేతలే ఈసమస్యను తీసుకువెళ్ళాలి మరి..

## పుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు

**విశాలాంధ్ర-విజయనగరం టౌన్ :** ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు ముందుగా ఆలయ అసిస్టెంట్ కమిషనర్ డివివి ప్రసాద్ రావు ఆధ్వర్యంలో ఉదయాన్నే చదురు, వనం గుడులు వద్ద అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం నైవేద్యం సమర్పించి పుష్పాలంకరణ చేశారు ఆలయానికి విచ్చేసిన భక్తులకు పూజారి బంటుపల్లి వెంకట్రావు ,ఏడిద వెంకటరమణలు పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సీనియర్ అసిస్టెంట్ ఏడుకొండలు, మణికంఠలు చర్యలు చేపట్టారు ఇదిలా ఉండగా మంగళవారం కలెక్టర్ గ పనిచేసి బదిలీపై వెళ్తున్న నాగలక్ష్మి, శ్రీకాకుళం జిల్లా జాయింట్ కలెక్టర్ నవీన్ కుటుంబ సమేతంగా చదురు గుడి వద్ద ఉన్న పైడితల్లి అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# ప్రజల సొమ్ముతో ఇచ్చే పథకాలకు పార్టీ నాయకుల పేర్లా?

### లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర రావు

**విశాలాంధ్ర-బొబ్బిలి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా వారు పెట్టిన పథకాలకు వారి పార్టీ నాయకుల పేర్లు పెట్టుకుని ప్రచారం చేసుకోవడం న్యాయమేనా అని లోక్ సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర రావు, జాతీయ వినియోగదారుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర పబ్లిక్ రిలేషన్ జాయింట్ శెక్రటరి దాసరి సురేష్ అన్నారు. వారు విలేకరులతో మాట్లాడారు . రాష్ట్రంలో ఎన్నికలు జరిగిన తర్వాత అధికారంలోకి వచ్చిన ఏ పార్టీ అయినా కూడా తామేదో తమ సొంత జేబులో నుండి గాని లేదా వారి వ్యాపార సంస్థల నుండి గాని తమ సొంత డబ్బు ప్రజలకు ఇస్తున్నట్టు వారి పేరు, లేదా ఆ పార్టీ నాయకుల పేర్లు పెట్టుకొని ప్రచారం చేసుకోవడం. వారేదో పాపం దయతో ఇచ్చే వారు- ప్రజలు పుచ్చుకునే వారు మరి. ఆ పథకాలు అమలు చేస్తున్నది ప్రజలు తాము కష్టపడి సంపాదించి కడుతున్న పన్నుల డబ్బు అనే కనీస జ్ఞానం లేకపోతే ఎలా? ఒకాయనేమో తమ పార్టీ అధికారంలో ఉన్నపుడు జగనన్న, రాజన్న, వైఎస్ఆర్ అని పేర్లు పెడతారు. ఇంకొక ఆయన అధికారంలో ఉంటే చంద్రన్న, అన్న, ఎన్టీఆర్ అని పేర్లు పెట్టి ప్రచారం చేసుకోవడం. ఇంక పింఛను పుస్తకాల మీద, పట్టాదారు పాసు పుస్తకాల మీద, పొదుపు సంఘాల పుస్తకాల మీద, ఆరోగ్య భీమా మీద, ప్రభుత్వం ప్రజలకు ఇచ్చే పత్రాల మీద అంతా అధికార పార్టీ నాయకుల ఫోటోలే. ఈ ప్రచారానికే కోట్లాది రూపాయల ప్రజా ధనం వృథా. మన రాష్ట్రంలో నిజాయితీగా ప్రజల కోసం పని చేసే నాయకులు అయిన టంగుటూరి ప్రకాశం పంతులు, పొట్టి శ్రీరాములు, దామోదరం సంజీవయ్య, సర్దార్ గౌతు లచ్చన్న, వావిలాల గోపాలకృష్ణ, పుచ్చలపల్లి సుందరయ్య, తరిమెల నాగిరెడ్డి వీరి పేర్లు, ఫోటోలు పెట్టడానికి ఎక్కడా పనికిరారు. చరిత్రను ఎలాగూ విద్యార్థులకు దూరం చేసేసారు. ఇలాంటి వారి పేర్లు, ఫొటోలు పెడితే ఈ నాటి తరం వారికి వారు ఎవరో కనీసం తెలుస్తుందిగా. ఆహా అంతటా మన పేరే ప్రచారంలో ఉండాలి అది ఈ నాటి రాజకీయ పార్టీల నాయకుల తీరు. తెలుగువారు తెలుగులోనే మాట్లాడాలి. మంచి నినాదం. కానీ అధికారంలో ఉన్న పార్టీ పెట్టే పథకాల పేర్లు మాత్రం ఆంగ్లంలో ఉండొచ్చు. ఏమి రాజ నీతి. ఉదాహరణకు అన్నా కేంటీన్. ఆంధ్ర ప్రదేశ్ అంటే అన్నపూర్ణ. చక్కగా తెలుగులో అన్నపూర్ణ ఆహార పథకం లేదా అన్నపూర్ణ ఆహార శాల అని పెట్టవచ్చుగా. అలాగే నాడు-నేడు పేరు మార్చారు. దాని పేరు స్కూల్ ఇన్ఫ్రా స్ట్రక్చర్ ఇంప్రూవ్మెంట్. అసలు ఈ పేరు ఎవరికయినా గుర్తు ఉంటుందా....? దీనిని తెలుగులో పాఠశాల పునరుద్ధరణ, పాఠశాల పునఃపరిశీలన లేదా బడి బాగు చేద్దాం, బడి బలోపేతం చేద్దాం. ఇలా తెలుగులో చక్కగా పెట్టవచ్చు కదా. ఒకప్పుడు ప్రభుత్వ కార్యాలయాలలో స్వాతంత్ర్య సమరయోధుల ఫొటోలు ఉండేవి. ఇప్పుడు వారి స్థానంలో దేశ ప్రధాన మంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి ఫొటోలు పెడుతున్నారు. ఇప్పుడు ఉప ముఖ్యమంత్రి ఫొటో కూడా చేరింది. మరి కొద్ది రోజులు పోతే మీ జిల్లా మంత్రుల ఫోటోలు, మీ నియోజక వర్గ ఎమ్మెల్యేల ఫొటోలు కూడా పెట్టండి అని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినా ఆశ్చర్య పడనక్కర లేదు. ఈ ప్రచార యావ మన నాయకులకి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రజలు ఓట్లు వేసి ఎన్నుకున్న నాయకులు, ప్రజలు కట్టే పన్నుల డబ్బులనే వేతనంగా తీసుకుంటూ ప్రజలకు జవాబుదారీగా ఉండవలసిన నాయకులు ప్రజల సొమ్ముతో వారి సొంత ప్రచారం, విలాసవంతమైన జీవితం, ఇదీ మన ప్రజాస్వామ్యం. ప్రజలారా కాస్త ఆలోచించాలని కోరారు.

## గురజాడ గృహంలో గౌరీ నాయుడు సాహిత్య ప్రసంగం

**విశాలాంధ్ర-లక్కవరపుకోట:** ప్రముఖ అభ్యుదయ కవి, సాహితీ వేత్త, నాటక కర్త, గేయ రచయిత, గురజాడ వెంకట అప్పారావు స్వగృహాన్ని మండలంలోని కితన్నపేట గ్రామానికి చెందిన ఎవరైతే యువకవి రాచకొండ నరసింహ శర్మ సాహితీ సంస్థ డాక్టర్ కిలారి గౌను నాయుడు విజయనగరంలో సందర్శించారు. గురజాడ అప్పారావు ముని మనవడు గురజాడ సర్వేశ్వర ప్రసాద్, గురజాడ ఇందిరా దేవి ఆహ్వానం మేరకు విజయనగరం వెళ్లడం జరిగిందని ఈ సందర్భంగా మంగళవారం సాహిత్య కార్యక్రమంలో గురజాడ ఇందిరా గౌడ నాయుడుని సభకు పరిచయం చేశారని ఒక ప్రకటనలో గౌడ్ నాయుడు మంగళవారం తెలిపారు. ముందుగా గురజాడ అప్పారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించామని ఈ కార్యక్రమంలో భాగంగా సెయింట్ జోసెఫ్ విద్యాసంస్థలు విజయనగరం మహారాజు కళాశాల విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారని తెలిపారు ఈ కార్యక్రమంలో గురజాడ అప్పారావు సాహిత్య రచనల ప్రత్యేకతను కన్యాశులకు నాటకం ద్వారా సమాజంలో తీసుకు వచ్చిన చైతన్యాన్ని విద్యార్థులకు వివరించామని తెలిపారు మహిళల జీవన ప్రమాణ స్థాయి మెరుగుపరచడంలో గురజాడ రచనలు ఎంతగానో తోడ్పడ్డాయని గవర్నమెంట్ తెలిపారు సాహిత్య, సంగీత, సాంస్కృతిక కళా రంగాలను ఎంతగానో ప్రభావం చేసిన గురజాడ అప్పారావు నివసించిన 200 ఏళ్ళనాటి గురజారి ఇంటిని సందర్శించడం గొప్ప అనుభూతిగా ఉందని గౌరీ నాయుడు గుర్తు చేసకున్నారు ఈ కార్యక్రమంలో అధ్యాపకురాలు డాక్టర్ దీప్తి, వీణ, కోటేశ్వరరావు, ఇందిరా, ప్రసాద్ గురజాడ అభిమానులు తదితరులు గౌడ్ నాయుడుని సత్కరించాలని తెలిపారు కార్యక్రమంలో అధ్యాపకులు సాహిత్య అభిమానులు గురజాడ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

## చేయూత డబ్బులు పడని మహిళలకు వెంటనే జమ చేయండి : ఎండిఓకి వినతి పత్రం

**విశాలాంధ్ర-బొబ్బిలి:** 4 విడత చేయూత డబ్బులు ఎన్నికల ముందు హడావిడిగా వైసిపి ప్రభుత్వం బటన్ నొక్కింది.ఎన్నికల కోడ్ రావడంతో కొందరికి పడి కొందరికి పడక మహిళలు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ఎన్నికల ప్రచారం సందర్భంగా సంక్షేమ పథకాలన్నీ కొనసాగిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. అందులో భాగంగా చేయూత డబ్బులు వెంటనే రానివారికి వాళ్ళ ఖాతాలో జమ చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి శంకరరావు ప్రభుత్వాన్ని కోరారు ఎండిఓ గారికి వినతి పత్రం అందజేశారు.అలాగే బొబ్బిలి మండలం రంగరాయపురం గ్రామంలో ఉపాధి హామీ పని వంద రోజులు ప్రభుత్వం ప్రకటించిన వేతనం ఇవ్వాలి కానీ ఆ గ్రామంలో 100 రోజులు పని ఇవ్వకుండా ఆపేశారు ప్రభుత్వం ప్రకటించిన వేతనం కూడా అందడం లేదు. తక్షణమే ఏపీఓ కలగజేసుకొని అక్కడ 100 రోజులు పని ప్రభుత్వం ప్రకటించిన వేతనం ఇవ్వాలని వినతిపత్రం ఇవ్వడం జరిగింది. రేపు పరిష్కారం చేస్తానాని హామీ ఇచ్చారు. అలా కానీ ఎడల ఎల్లుండి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ రంగరాయపురం కార్యదర్శి ఉడముల ప్రసాదు మహిళలు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యపై మంత్రి కొండపల్లికి వినతి పత్రం అందజేసిన జాప్

**విశాలాంధ్ర-విజయనగరం టౌన్ :** జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్(జాప్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల, హెల్త్ కార్డుల, ఫీజు రాయితీలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉపాధ్యక్షులు అవనాపు సత్యనారాయణ జిల్లా అధ్యక్షులు మానాపురం రవిచంద్రశేఖర్ జిల్లా కమిటీ సభ్యులు వినతి పత్రాన్ని అందజేశారు. జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానని రాష్ట్ర చిన్న మధ్యతరహా పరిశ్రమలు సర్ఫ్ మరియు ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు అన్నారు.జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్, (జాప్ ) జిల్లా శాఖ కార్యవర్గ సభ్యులు మంగళవారం జిల్లా పరిషత్ అతిథి భవనంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించడం జరిగింది. అనంతరం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని అదేవిధంగా జర్నలిస్ట్ పిల్లలకు ప్రైవేట్ స్కూల్లో రాయితీ ఇవ్వాలని ఆయనకు వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది ఆయన స్పందిస్తూ జర్నలిస్ట్ సమస్యలను తెలుసుకొని ప్రభుత్వ దృష్టికి తీసుకుని వెళ్లి ఒక్కొక్కటిగా పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.మంత్రిని కలిసిన వారిలో జాప్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జీవీఆర్ గోపాల్ వర్మ , ఉపాధ్యక్షులు అల్లార రమణ, గౌరవ సలహాదారు వాడాడ గౌరీ శంకర్, జాయింట్ సెక్రెటరీ అరుణ్ కుమార్, హేమంత్‌కుమార్, కార్యవర్గ సభ్యుడు బి శ్రీనివాస్ ఉన్నారు.

## పట్టుబడిన వాహనాలకు జూన్ 28న బొబ్బిలి లో వేలం

**విశాలాంధ్ర-బొబ్బిలి :** వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను జిల్లా ఎస్పీ ఆదేశాలమేరకు బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు ,అసిస్టెంట్ ఎన్ఫోర్స్మెంట్ ఆఫీసర్ సమక్షంలో జూన్ 28న బొబ్బిలి మోడల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో వాహనాలను వేలం వేయనున్నారు. సి ఆర్ నెంబర్ 264/2020, ఏపీ 35 ఏఎన్ 56 82 యమహా స్కూటీ 15000 రూపాయలు 18% జీఎస్టీ అదనం, సి ఆర్ నెంబర్ 323/2020, ఏపీ 35 ఏసి 72 12 టీవీఎస్ స్టార్ సిటీ 1500 రూ. 18 శాతం జీఎస్టి, సి ఆర్ నెంబర్ 488/2020, ఏపీ 35 ఏ ఎఫ్ 1171 టీవీఎస్ ఎక్సెల్ 3000 రూ. సి ఆర్ నెంబర్ 28 /2023 ఆటో రిక్షా ఏపీ 35 డబ్ల్యు 97 32, 66 వేల రూపాయలు . నిర్వహిస్తున్నట్లుగా తెలియజేశారు. ఈ వేలంపాటను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## కాలేజీలో మొక్కలు నాటిన పర్యావరణ పరిరక్షణ సమితి

**విశాలాంధ్ర-రాజాం :** స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల హైస్కూల్ ఆవరణలో మంగళవారం రాజాం పర్యావరణ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ జనార్దనరావు, పర్యావరణ పరిరక్షణ సమితి కన్వీనర్ ఆర్విజె నాయుడు, ప్రతినిధులు పిఎన్ విఎన్ గుప్త, పెంకి చైతన్యకుమార్, ఉల్లాకుల నీలకంఠేశ్వర యాదవ్ తదితరులు మొక్కలు నాటారు.

## పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

**విశాలాంధ్ర-పూసపాటిరేగ:** పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన వెల్దురు గ్రామంలో జరిగింది. ఎస్సై సన్యాసినాయుడు ఇచ్చినా వివరాలు ప్రకారం విశాఖలో ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్న బాకీ అర్జున్ రెడ్డి.(37) తండ్రి .శంకర్ రెడ్డి. గత కొంతకాలంగా మద్యానికి బానిసై కడుపు నొప్పితో బాధపడుతూ ఉండేవాడు. పది రోజుల కిందట విశాఖపట్నం నుండి వెల్దురు వచ్చాడు. రెండు రోజుల కిందట మద్యం తాగి భోజనం చేసి ఇంటి నుండి బయటికి వెళ్లి మళ్లీ తిరిగి రాలేదు. రెండు రోజులుగా వెతుకుతుంటే ఊరిలో గల కొబ్బరి తోటలో అపస్మారక స్థితిలో ఉన్నాడని తెలిసి అతని తల్లి సన్యాసమ్మ వెళ్లి చూడగా నోటిలో చిన్నగా నురగలు కక్కకొని చనిపోయి ఉన్నాడు. ఇతనికి ఒక భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. అతనికి సమీపంలో పురుగుల మందు బాటిల్ దొరికిందని అతను తెలిపారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మధ్యాహ్న భోజనాలను ఎంఇవో తనిఖీ

**విశాలాంధ్ర-జామి:** మండలంలోని పలు పాఠశాలలలో మండల విద్యాశాఖాధికారి-2 జి.గంగరాజు మధ్యాహ్న భక్షజన పథకం పనితీరును తనిఖీ చేసారు. నేరుగా ఆయన వంతశాలల వద్దకు వెళ్ళి వంట చేస్తున్నా తీరును గమనించారు. వంట చేసే సమయంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని వంటవాళ్ళుకు సూచించారు. జామిలోని అల్లువీధి పాఠశాలలో విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాన్ని తానుకూడా స్వయంగా రుచిచూసారు. అనంతరం నిర్వాహకులకు పలు సూచనలు చేసారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు వడి వడ్డిస్తున్న భోజనం ప్రభుత్వం ఆదేశించిన మెనూ ప్రకారం ఉండాలన్నారు. లేని యెడల చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట తనిఖీలలోసిబ్బంది గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## పినతాడివాడ, అమ్మకం గ్రామాల్లో డ్రై డే

### ఎంపీడీవో లవరాజు

**విశాలాంధ్ర-డెంకాడ:** మండలంలోని పినతాడివాడ అమ్మకం గ్రామాల్లో కమిషనర్ పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ఆదేశాల మేరకు మంగళవారం ఎంపీడీవో ఏ. లవ రాజు పర్యవేక్షణలో డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారము శుక్రవారం రోజు ఎంపిక చేసిన గ్రామాల్లో డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఈరోజు పినతాడివాడ అమ్మకం గ్రామాల్లో కాలువలు శుభ్రం చేయించి అబట్ ఆయిల్ ని డ్రై చేయించి నీటిని ట్యాంకులకు ఎక్కించి నా ప్రతిసారి క్లోరినేషన్ చేయించాలని అదేవిధంగా ప్రతి 15 రోజులకు ఒకసారి ట్యాంకు శుభ్రపరిచి వాటి తేదీలను నమోదు చేయాలని త్రాగునీటిని క్రమబద్ధంగా పరీక్షలు చేయవలసినదిగా పంచాయతీ కార్యదర్శులను సచివాలయం సిబ్బందికి ఆదేశాలు ఇచ్చామని ఎక్కడా నీరు నిలవ ఉండకుండా చూడాలని ప్రజలు కాచి చల్లార్చిన నీరు మాత్రమే త్రాగాలని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు ఈ కార్యక్రమంలో మెడికల్ సిబ్బంది మరియు పంచాయతీ కార్యదర్శులు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## ప్రజలకు అసౌకర్యం కలిగించే ఏ చర్యలూ ఉపేక్షించం

### నగరపాలక సంస్థ కమిషనర్ నాయుడు

**విశాలాంధ్ర-విజయనగరం టౌన్ :** ప్రజలకు అసౌకర్యం కలిగించే ఏ చర్యలనైనా ఉపేక్షించవద్దని ప్రణాళిక కార్యదర్శులకు నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు సూచించారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నగర ప్రణాళిక అధికారులు, కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సచివాలయాల వారీగా ప్రణాళిక విభాగానికి సంబంధించి చేపడుతున్న చర్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రకటన బోర్డుల యొక్క పన్నులు, ఇతరత్రా పన్నులు రాబట్టడంలో ఉదాసీనంగా వ్యవహరించిన కార్యదర్శులు పట్ల అసహనం వ్యక్తం చేశారు. సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ నగరంలో వివిధ ప్రాంతాలలో భవన వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ నిల్వ లేకుండా చూడాలన్నారు. ప్రణాళిక కార్యదర్శులు క్షేత్ర పర్యటనలు చేస్తూ వ్యర్థాల తొలగింపునకు చొరవ చూపాలన్నారు. ప్రభుత్వ స్థలాలకు రక్షణా చర్యలు చేపట్టామని, కొన్నిచోట్ల మరమ్మతులకు గురైనట్లు గమనించామన్నారు. వాటిని కూడా తక్షణమే పరిరక్షించే చర్యలు చేపట్టాలన్నారు. అలాగే శిథిలావస్థకు చేరుకున్న భవనాలను గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్లు మధుసూదన్ రావు, అమ్మాజీ రావు, సర్వేయర్ సింహాచలం, టి పి ఎస్ ఫిలిప్, ప్రణాళిక కార్యదర్శులు పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ అవసరం

### ఆర్‌జెడి బి విజయభాస్కర్

**విశాలాంధ్ర-విజయనగరం టౌన్:** ప్రతి విద్యార్థి పై వ్యక్తిగత శ్రద్ధ అవసరమని ఆర్జెడిబి విజయభాస్కర్ అన్నారు. మంగళవారం స్థానిక గురజాడ పాఠశాలలో విజయనగరం డివిజన్ కు సంబంధించిన డిప్యూటీ డిఈఓలు ఎంఈఓ లు ప్రధానోపాధ్యాయులతో సమావేశాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆర్జెడి బి.విజయభాస్కర్ మాట్లాడుతూ రానున్న విద్యాసంవత్సరానికి సంబంధించి ఉపాధ్యాయులను విద్యార్థులను సన్నద్ధం చేసే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అలాగే ప్రతి విద్యార్థి పై వ్యక్తిగత శ్రద్ధ అవసరమని, ప్రతి విద్యార్థికి పూర్తిస్థాయిలో పుస్తకాలు అందేలా చూసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువగా విద్యార్థులు చేరేందుకు ప్రయత్నం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఇఓ ప్రేమ్ కుమార్ విజయనగరం డిప్యూటీ డిఈఓ కే వెంకటరమణ, బొబ్బిలి డిప్యూటీ డిఈఓ కే మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు

## నీటిపారుదల శాఖ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే మాధవి

**విశాలాంధ్ర-భోగాపురం:** నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును నెల్లిమర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే లోకం మాధవి మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా రామానాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో నీటి ప్రాజెక్టులు, కాలువలు గురించి చర్చించినట్లు సమాచారం.

## ధర్మవరం హైస్కూల్లో మాక్ పోలింగ్ నిర్వహణ

**విశాలాంధ్ర-శృంగవరపుకోట :** ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాక్ పోలింగ్ ద్వారా పాఠశాల విద్యార్థి నాయకుడిని, ఉప నాయకుడిని ఎన్నుకున్నట్లు ధర్మవరం ఉన్నత పాఠశాల ఇంచార్జి హెచ్ఎం ఎస్. శివరామకృష్ణ మంగళవారం తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు ఆర్ వి ఎస్ యన్ మూర్తి, వి.ఈ సత్యనారాయణ, రమేష్ నాయుడు, పొట్నూరు శ్రీరాములు, రహీమ్ షేక్ లాల్ ఆధ్వర్యంలో ఎలా అయితే సాధారణ ఎన్నికలలో సభ్యులను ఎన్నుకోవడం జరుగుతుందో అలాగే విద్యార్థి నాయకుడు, ఉప నాయకుడు ఎన్నికలకు సంబంధించి నామినేషన్ ప్రక్రియ, ఉపసంహారణ ప్రక్రియ, ఎన్నికల ప్రచారం, ఓటింగ్ ప్రక్రియ, ఓట్ల లెక్కింపు ప్రక్రియ, విద్యార్థి నాయకుడు ఉప నాయకుడు ఎన్నికల ప్రకటన వరకూ ఇలా అన్ని విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలనే ఈ మాక్ పోలింగ్ కార్యక్రమం నిర్వహించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ ఎన్నికల లో బి నవ్య కు 23ఓట్లు, బి.యోగికు 60 ఓట్లు, సీహెచ్ జగదీష్ కు 18ఓట్లు, కె.పల్లవికు 43ఓట్లు, యల్ శిరి కు 16ఓట్లు, పెద్దింటి రాజేష్ కు 70 ఓట్లు, పి. సాయిరాజ్ కు 2ఓట్లు, రాడి సన్యాసిరావు కు 75 ఓట్లు వచ్చినట్లు తెలిపారు. పోటీ చేసిన వారిలో రాడి సన్యాసిరావు 75 ఓట్లతో విద్యార్థి నాయకుడు గా, పెద్దింటి రాజేష్ 70 ఓట్ల తో విద్యార్థి ఉప నాయకుడు గా గెలిచినట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్. శివరామకృష్ణ, ఆర్ వి ఎస్ యన్ మూర్తి, వితఈ సత్యనారాయణ, జి.రమేష్ నాయుడు, శ్రీరాములు, కృష్ణ, రహీమ్ షేక్ లాల్, ఈశ్వరరావు, ఎన్నికల అధికారులుగా ఐ యన్ ఎం మూర్తి, శోభారాణి, జయలక్ష్మి, శివాజీ, శ్రావణి, లావణ్య, సబీనా బి, ఎస్ వి ఎస్ యన్ మూర్తి, ఏవి స్వామి, హరి, యల్ వి సత్యనారాయణ, పాపారావు, సూర్యకుమారి తదితరులు వ్యవహారించారు. ఈ కార్యక్రమంలో 3వ తరగతి నుండి 12 వ తరగతి వరకూ విద్యార్థులు ఓటర్లుగా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

## ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు ఎన్నికైన సందర్భంగా ఆర్థివలస గ్రామస్తులు గ్రామ దేవతకి మొక్కులు

**విశాలాంధ్ర-చీపురుపల్లి :** చీపురుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యేగా కిమిడి కళావెంకటరావు గెలవాలని ఆర్థివలస గ్రామస్తులు భగీరథ అమ్మ వారికి మొక్కుకున్న సందర్భంగా మంగళవారం ఆర్థివలస గ్రామస్తులు భగీరథ అమ్మవారిని దర్శించుకుని ఆ మొక్కు లు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆహ్వానం మేరకు యువనాయకులు,రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ మల్లిక్ నాయుడు భగీరథ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## శ్రీ మానసా దేవి అమ్మవారి ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ మల్లిక్ నాయుడు

**విశాలాంధ్ర-చీపురుపల్లి:** చీపురుపల్లి నియోజకవర్గం చీపురుపల్లి మండలం పుర్రేయ వలస గ్రామంలో స్వయంభు గా వెలసిన శ్రీ మానసా దేవి నాగ శక్తి అమ్మవారి ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు అమ్మవారిని దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదములు తీసుకున్నారు. నియోజకవర్గంలో ఉన్న ప్రజలందరికీ మేలు చేకూర్చాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాల విక్రయాలు

- పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి
- కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాల దోపిడీకి సహకరిస్తున్న డిప్యూటీ డిఇఓ సస్పెండ్ చేయాలి
- డిప్యూటీ డిఇఓ కార్యాలయం వద్ద ఎస్ఎఫ్ఐ నాయకుల ఆందోళన

**విశాలాంధ్ర-బొబ్బిలి:** పట్టణంలో పుస్తకాల పేరుతో విచ్చలవిడిగా విద్యార్థుల యొక్క తల్లిదండ్రుల వద్దనుండి ఫీజులు జలగల్లా పీడిస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల వైఖరికి నిరసనగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో డిప్యూటీ డిఈవో కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి రాము మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు ప్రకారం పాఠశాలల్లో ఎటువంటి పుస్తకాలు అమ్మకూడదు అని చెప్తున్నా బొబ్బిలిలో చాలావరకు ప్రైవేట్ , కార్పొరేట్ పాఠశాలలో వేలకు వేలు ఫీజులు దండుకుంటూ పుస్తకాలను అమ్ముతున్నాయి. వీటినే అడ్డుకోవాల్సిన అధికారులు పాఠశాల యాజమాన్యాలకు కొమ్ముకాసే నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తున్నారు. దీని పట్ల నిన్న పాఠశాల వద్ద ఆందోళన నిర్వహించిన ఎస్ఎఫ్ఐ నాయకులు పై పోలీసులను ఉపయోగించి దౌర్జన్యంగా అరెస్టులు చేయడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. ఒకవక్క ప్రభుత్వ నిర్ణయించిన పాఠశాలల ఫీజుల కంటే అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తూనే మరోపక్క పుస్తకాలు, యూనిఫామ్ లు పేర్లతో ఇటువంటి కార్పొరేట్ పాఠశాలలో పెద్ద ఎత్తున దోచుకుంటున్నాయి. తక్షణమే జిల్లా విద్యాశాఖ అధికారులు ఇటువంటి పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకొని నిబంధనలు అతిక్రమిస్తున్న పాఠశాలల యొక్క గుర్తింపులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఇటువంటి పాఠశాలల యాజమాన్యాలకు సహకరిస్తున్న వారిపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. నిన్న సురేష్ పాఠశాల విషయంలో పాఠశాల యాజమాన్యానికి వత్తాసు పలికిన డిప్యూటీ డిఈఓ ని తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యార్థులతో పెద్ద ఎత్తున పోరాటం నిర్వహిస్తామని దీనికి జిల్లా విద్యాశాఖ అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు మణికుమార్ , డేవిడ్ , మండల నాయకులు కిరణ్ ,సాయి మణి, తదితరులు పాల్గొన్నారు.

## వంగర లో 130 మందికి కంటి వైద్యపరీక్షలు

**విశాలాంధ్ర-వంగర :** వంగర వివేక్ మాస్టర్ మైండ్స్ హైస్కూలు వద్ద ను ఉచిత కంటి పరీక్షలు కంటి వైద్య నిపుణులు చేశారు. మంగళవారం నవజీవన్ సేవా సంస్థ తిరుపతి డా॥ కే శ్రీధర్ ఆచార్య వారి ఆర్థిక సహాయ సహకారంతో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి విశాఖపట్నం వారి చే ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ ఎస్ జాక్సన్ 130మందికి కంటి తనిఖీలు చేశారు. వీరిలో 64 మంది ఐ ఓ యల్ కేటరేక్టు ఆపరేషన్ కు ఎంపికయ్యారు. ఈమేరకు కంటి పరీక్షలు చేసిన డాక్టర్ కే.శ్రీధర్ ఆచార్య ఈ విషయాన్ని తెలిపారు.ఆపరేషన్ కు ఎంపికైన వారిని మంగళవారమే విశాఖ శంకర్ ఫౌండేషన్ హాస్పటల్ బస్సులో తరలించారు. అచ్చట హాస్పటల్లో కంటి శస్త్ర చికిత్సలు చేయనున్నారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వంగర ప్రాదిమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిని సిరికి జ్యోతి, స్పందన స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు సాదెం వెంకటరమణ, శంకర్ ఫౌండేషన్ క్యాంపు ఇంచార్జి సిహెచ్ వెంకట రమణ, వివేక్ మాస్టర్ మైండ్స్ స్కూల్ ప్రిన్సిపాల్ బెవర ఈశ్వర్ రావు స్పందన సభ్యులు బి గణపతి, తూముల యోగేంద్ర, ముంజి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి కొండపల్లి ని కలిసిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొంప క్రిష్ణ

**విశాలాంధ్ర-శృంగవరపుకోట:** ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ గ్రామీణ పేదరిక నిర్మూలన సంఘం, ఎన్నారై సాధికారత శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గొంప క్రిష్ణ సోమవారం రాత్రి కలిశారు. ఈ సందర్భంగా వారు పలు విషయాలు చర్చించారు.

## తొలి కేబినెట్ లోనే హామీల అమలుకు శ్రీకారం చుట్టిన సీఎం చంద్రబాబు

### కృతజ్ఞతలు తెలిపిన ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ళ

**విశాలాంధ్ర-వేపాడ:** రాష్ట్రం లో కూటమి ప్రభుత్వం అధికా రంలోకి రాగానే నిర్వహించిన మొదటి కేబినెట్ భేటీలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నారా చంద్రబాబు నాయుడు పలు పైల్స్ పై తొలి ఐదు సంతకాలు చేసి రాష్ట్ర అభివృద్ధికి శ్రీకారం చుట్టారని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారి హర్షం వ్యక్తం చేశారు. మంగళ వారం లక్కవరపుకోటులోని వారి స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఏళ్ల తరబడి చూసిన ఎదురు చూపులకు ఫలితం దక్కిన శుభదినం 16,347 పోస్టులతో కూడిన మెగా డీఎస్సీ,ప్రజా వ్యతిరేక చట్టం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు,ప్రతి ఇంటికి పెద్ద కొడుకులా నెలకు రూ.4 వేలు పెన్షన్ పెంపు, నిరుపేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్ల పునః ప్రారంభం,నైపుణ్య గణనపై ఐదవ సంతకం చేసి యువత భవితకు బంగారు బాటలు వేసేందుకు రూపకల్పన చేశారన్నారు.ఈ కార్యక్రమంలో ఎల్.కోట మాజీ ఎంపీపీ కొల్లి రమణమూర్తి,క్లస్టర్ ఇంచార్జ్ పొట్నూరు వెంకటరత్నాజీ, విశాఖ పార్లమెంటు తెలుగు యువత ఉపాధ్యక్షులు లెంక శ్రీను,విశాఖ పార్లమెంట్ కార్య నిర్వాహక కార్యదర్శి విర్రోతు శివాజీ,గొంప దుర్గా ఉమేష్,కొట్టాన విజయ్ కుమార్,యేదువాక గణేష్,గొంప చిన బాబు,గొంప పోతునాయుడు,కోళ్ళ రాము నాయుడు, ఎర్నాయుడు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.